తప్పినందుకు ఆనందపడిపోతూ తన గదిలోకి వెళ్లి సిగరెట్ అంటించాడు రఘుచంద్ర.

నేరం పనిమనిషిది కాదు. గిన్నెలబుక్కుదే. పదిమందికి ఉపకారం జరిగే పనులను సాధించి రికార్డు నెలకొల్పినవారికే దానిలో పేరు నమోదు చేస్తానంటే బావుండేది. కాని గోళ్ళు పెంచేవాళ్ళకీ, జుత్తు పెంచేవాళ్ళకీ రోజులు తరబడి ఆపకుండా ఏడ్చేవాళ్ళకీ - అడ్డమైన పనుల వాళ్ళకీ అందులో స్థానమంటే ఇలాగే ఉంటుంది. ఏమైతేనేం పనిమనిషి ధర్మమా అని తమకు వివేకం వికసించింది.

పనిమనిషెక్కుతుందని కదా తను గిన్నీస్ బుక్ ప్రయత్నం మానేసింది సూర్యకాంతం ? పనిమనిషి కాని టి.వి. కొంటే, తన ఇంట్లో టి.వి. ని ఎవరికైనా ఇచ్చేస్తుందా సూర్యకాంతం? పనిమనిషి దగ్గర ఉన్నది తన దగ్గరవుంటే పరువు తక్కువని ? పనిమనిషికి వాయిదాల పద్ధతిలో కలర్ టివి ఇప్పిస్తే, అది తీసుకుంటే ? అలా జరిగితే ఎంత బావుంటుంది. టి.వి.లేని ఇల్లు ఎంత హాయి. సిగరెట్ పీలుస్తూ వెనక్కి వాలాడు రఘుచంద్ర.

- సమాప్తం -

# అమ్మా.. ఆకలీ!

గ్రీష్మమంటే ఉష్ణం, జ్యేష్టమంటే కాష్టం.. అన్న నానుడిని నిజం చేస్తూ మధ్యాహ్నం సూర్యుడు చండ ప్రచండగా వెలిగిపోతున్నాడు. భూమి పెనమై, దానిమీది జీవులు పేలాలై వేడికి వేగిపోతున్నారు. కాని అంత ఎండలోనూ ఆమె అడుక్కోడం మాత్రం ఆశ్చర్యమే.

ఆమెది పగలే వెన్నెలా అనుకోగలిగే పడుచు వయసుకాదు. కనీసం నడి వయసుకూడా కాదు. ఆమె ముదుసలి. శ్రీశ్రీ కవితలోలాటి వృద్ధురాలు, భిక్షుకి ముసలితనం ఆమె నడుముని నిటారుగా నిలువనివ్వక విల్లులా వొంచేసి వొదిలింది. తలను 'చింపిరి ముగ్గు బుట్టగా మార్చేసింది. చేతికర్ర ఊత లేకపోతే అడుగు తీసి అడుగు వేయలేదేమో అన్నట్లే ఉందా అవ్వ. భుజానికో చిన్నజోలె, తిరిపె మెత్తుకు బతికే ఆమె పాదాలకు చెప్పులెలా ఉంటాయి ?లేవు.

"అమ్మా ! దరమం తల్లీ.." దీనంగా.. నీరసంగా బాధగా..

"ఆకలికడుపు మండి పోతూందమ్మ.. అన్నపూర్ణా.." అక్రందన.

'మూడ్రోజులయి ముద్ద నేదు తల్లీ.. కబళమేయించు కన్నతల్లీ.. ఆ ముసలమ్మకి నిజంగానే ముద్దలేదు మూడు రోజులై కడుపులో ఆకలి. బటటేమో ఎండ. ఎక్కీ గుమ్మం, దీగీ గుమ్మంగా తిరుగుతోంది. ఏ తలుపూ తెరుచుకోవడం లేదు. ఏ తల్లీ పట్టెడన్నం పెట్టడమూ లేదు. అలసిపోయి ఏ క్షణాన శోషొచ్చి పడిపోతుందో అన్నట్లే ఉందా ముదివగ్గు.

"అమ్మా ! తల్లీ.." కంఠంలో వార్ధక్యపు వణుకు. ఆకలి, అలసటల వల్ల నూతిలోంచి గొంతుకలా నీరసంగా..

ఆ తలుపులు దయగా తెరుచుకున్నాయి. ఒక నడివయస్కురాలు తలుపులలోంచి తల బయటకు పెట్టి కళ్లు చిట్లించి చూసింది.

"ఇంత ఎండలో అడుక్కుంటున్నావా !" ఆశ్చర్యపోయిందా గృహిణీ.

"ఎండ వేడికంటె ఆకలి మంట మరీ ఎక్కువమ్మా.. అంది ముసిలమ్మ.

'అన్నముందికాని అట్టేలేదు. రెండో మూడో ముద్దలుంటుందేమో..కొంచెం భాదపడుతూనూ, సిగ్గుపడుతూనూ అందావిడ.

"మీ దయ. అంతే ప్రాప్తమనుకుంటాను"

"ఐతే యిలా రా నీడలోకి తెస్తాను." అని ఆవిడ లోపలికి వెళ్ళి నిమిషంలో తిరిగి వచ్చింది. ఆకులో అన్నం పట్టుకొని. ముసిలామె జోలె పట్టింది.

"ఈ భాగ్యానికింటికి పట్టుకెళ్ళడం కూడా దేనికి? ఇక్కడే తినిపో... గిన్నె పడితే నీళ్ళు పోస్తాను." అంది. ముసిలమ్మ చేతిలోని సత్తు గిన్నెనూ చూస్తూ "ఐనా నీకేమన్నా కొంపా గోడా ?" "కొంపనేదు గాని ఊరవతల చెట్టుందమ్మా. అదే మాకు గూడు. గోడు ఓ కొడుకున్నాడు తల్లీ."

" కొడుకుంటే యీ కష్టమేమిటి ? ఈ వయసులో ఇంత ఎండలో ఆగమ్మ కాకిలా అన్నమో రామచంద్రా అంటూ తిరగవల్సిన కర్మేమిటి ? నీ కొడుకు..."

" ఆ పసోడినీ పస్తుపెట్టేస్తున్నానమ్మా పాపిష్టిదాన్ని.."

"పసివాడా ! నీ కొడుకు పసివాడా!" ఆశ్చర్యపోయిందా యిల్లాలు. ఇంత ముసల్దానికి పసివాడుకొడుకెలాగా అని.

"పసివాడంటే పసివాడే. పాతికేళ్ళు పైబడ్డాయి. ఐనా.. అమ్మనంటూ నేనున్నాక వాడు ఏ వయసువాడయినా పసివాడే కదా తల్లీ ! వెళ్ళొస్తా అన్నపూర్ణా ! అవతల నా బిడ్డ ఆకలితో ఎంత అలమటించిపోతున్నాడో. వెళ్తున్నాన మ్మాదరమతల్లీ పిల్లా పాపలతో పదికాలాలు పచ్చగుండు" దీవించి కదలబోయింది భిక్షుకి.

ఆవిడకాశ్చర్యం వేసింది. "నేను వేసిన అన్నం ఒక్క పొట్టకే సగానికయినా రాదే. దాన్ని యిద్దరు పంచుకోడం కూడానా !"

"ఎంతొస్తే అంతే పంచుకుంటాం. అదే కదమ్మా న్యాయం. నా బిడ్డకి రెండు ముద్దలూ, నాకో ముద్దా ముసిల్దాన్ని. ఇవాలో రేపో రాలిపోయే పండుటాకునీ ఎండుటాకునీ నేను తింటే ఏం, తినకపోతే ఏం ?"

"అదే మన్నమాట? నీకు మాత్రం ఆకలిగా లేదూ. ముసలితనమైతే మాత్రం ఆకలి ఉండకపోదుగా ? ఆ మాటకొస్తే ఆకలికి చిన్నవాళ్లే మరింత తట్టుకోగలరు. నా మాట విని నువ్వు తినెయ్.."

"బిడ్డల తల్లివి నీకు నేను చెప్పనక్కరలేదు. నీకు తెలియనిదీ కాదూ.." "ఏమిటి"?

" తల్లికెంత ఆకలిగా ఉన్నా అవతల బిడ్డ ఆకలితో ఉండగ ముద్దనోటికి పోతుందా? నేనూ నా కొడుకూ యిద్దరమూ పస్తే మూడు పొద్దులై."

"నీ కొడుకేం చేస్తాడు" "అడుక్కుంటాడు."

"ఏదైనా పని చెయ్యొచ్చుగా ?"

"దేముడు వాణ్ణి సగవే చూశాడు. ఒంటికంటితో చూశాడు. ఒక్క కాలే యిచ్చాడు.

వాడు అవిటివాడమ్మా. అడుక్కోవడం తప్ప మరేమి చెయ్యలేడు. అందుకేగా కొడుకుండీ నాకీ కర్మ?" ఒక్కక్షణం ఆగి "వాడి కడుపు నిండితేనే వాడి ఆకలి చల్లారితేనే నాకు ఆనందం." అంది.

మాతృధర్మం.. మాతృనైజం ఎంత సూటిగా సూక్ష్మంగా చెప్పింది. అనుకుంటూనే "చూడవ్వా. నీకింత తక్కువ అన్నం వేసినందుకు నాకు సిగ్గేస్తూంది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. డబ్బులిద్దామన్నా లేవు. మరోలా అనుకోకేం." అంది బాధగా.

"మంచిదానివే తల్లీ! అన్నం పెట్టిన అన్నపూర్ణని తక్కువ చేస్తే పురుగులు పడిపోనూ ? నీకు కలిగిన దాన్లో పెట్టావు. అదే పదివేలు ఐనా.. ఎంతపెట్టావన్నది కాదమ్మా. నీ మనసులో జాలీ, ధర్మమూ దయా అవీ ముఖ్యం. నాకుసెలవిప్పించు తల్లీ... అవతల నా బిడ్డ ఆకలితో ఉంటాడు. త్వరగా వెళ్ళాలి. అని కదిలిందా భిక్షుకి. ఎండ నిప్పులే చెరుగుతోంది.

జోలెలో అన్నం ఆకలిని మరింత రెచ్చగొడు తోంది. తిరిగి తిరిగిన కాళ్ళు – పీకుతున్నాయి.

అలసట.. నీరసం..నిస్త్రాణ.. కడుపులో ఆకలి మంటలు. ఐనా ఆమె వేగంగానూ, ఉత్సాహంగానూ నడుస్తోంది. ఆమెలో ఎంతో ఆనందం ఆరాటం. అంత దూరమూ చిటికెలో నడిచి యిట్టే చేరుకుంది చెట్టుకిందకి. తన ఆశ్రయమయిన ఆ చెట్టు కిందకామె చేరుకునే సరికి నీడన పడుకొని ఉన్నాడు కొడుకు. వొళ్లెరక్కుండా, ఆమెకు భయమేసింది. ఆకలికి తాళలేక సొమ్మసొల్లి పోలేదు కదా వెర్రి నాయన?

హడావిడిగా.. ఆందోళనగా.. దగ్గరలో ఉన్న కుంటనుంచి బొచ్చెతో నీరు తెచ్చింది. కొడుకు తలని తన తొడమీదకి చేర్చి కొనవేళ్ళతో ముఖం మీద చన్నీరు చిలకరించింది. అతను కళ్ళు తెరవలేదు కానీ ఒక్కసారటునుంచి ఇటు వొత్తిగిల్లాడు. ఆమె అతని పెదవులకి నీరందించి, "లే నాయనా..లే.. అంది. అప్పటికీ అతను కళ్ళు తెరవనూ లేదు, కదలనూ లేదు. "అన్నం తెచ్చానురా అబ్బాయ్.." మెల్లగా అంది.

ఆమె నోట ఆ మాట రావడమేమిటి ? అతను చటుక్కున లేచి కూర్చున్నాడు. ఎదురుగా పరచిన ఆకులో అన్నం కంటపడడమేమిటి అబగా.. మూడు కెరడులనీ రెండు ముద్దలుగా గబగబ నోట్లో కుక్కేసుకున్నాడు. క్షణమాలస్యమ యితే ఆ అన్నం తనకెక్కడ దక్కదో అని భయపడినట్లు. నిముషం తిరగకుండా ఆకు కాళీఐపోయింది. ఒక మెతుకేనా మిగలకుండా.

"ఇంతేనా ? ఇంక లేదా ! నా ఆకలి తీరనే లేదు. ఇంకేమీ లేదూ.? లేదని నోటితో అనడానికి ఆ తల్లికి నోరు రాలేదు. కాని ఆమె ప్రమేయం లేకుండానే గాజుకళ్ళలోకి నీళ్లు మాత్రం వచ్చాయి. కళ్ళలో నీళ్లతోనే నీరు నింపిన బొచ్చె అందించింది కొడుక్కి... తప్పుచేసినట్లు తలవంచుకొని అన్నం యికలేద ని తెలిపోయాక అతను నీటినే పట్టించాడు. కడుపునిండా అన్నమూ.. నీళ్లూ.. మొత్తానికతని కడుపు చల్లబడింది.

అప్పుడయినా "అమ్మా ! నువ్వు తిన్నావా?" అని అడుగుతాడేమో అని ఆశగా ఎదురుచూసిన ఆ మాతృమూర్తికి కొడుకు నుంచి అటువంటి పరామర్శ లభించలేదు. అతను కడుపు నిండడంతో మళ్లీ నిద్రలోకి

జారిపోయాడు. గుర్రు పెట్టసాగాడు. వృద్ధురాలికి చాలా దుఃఖమూ ఎన్నో కన్నీళ్లూ వొచ్చాయి. కాని తన కళ్ళు తానే తుడుచుకుంటూ.."బిడ్డ తప్పేముందీ ? కలిలో ఆకలిలో కూడా.. తల్లి బిడ్డ ఆకలి మరవజాలదు కానీ బిడ్డకి తల్లి ఆలకి స్పురణ రాదు.

అది కలి మహాత్యమూ ఆకలి మహాత్యమూ అని కొడుకు మీద ఈగ వాలకుండా తనకి తానే సర్దిచెప్పుకుంది.

అందుకే కదా ఆమె అమ్మ ? అమ్మంటే స్త్రీ కదా ?

\- సుహాస్తం -

# జీవితం

మెట్లెక్కి నేను లోపలికి ప్రవేశిస్తూండగానే నన్ను చూసి కంపౌడరు చిరునవ్వు నవ్వి చేతితో ఓ మూలగది- అదే డాక్టరు తాలూకు పర్సనల్ రూమ్‌వేపు చూపించాడు. ఔను. నేను అతనికి కూడా సుపరిచితుడినే. పేషెంటుని కాకపోయినా రెండు రోజులకో..మూడు రోజులకో ఒకసారి డాక్టర్ని చూడకుండా ఉండలేను. స్నేహం. ఎవరో 'ప్రేమకూడా వ్యాధే' అన్నట్లు గుర్తు. స్నేహం కూడ జబ్బేనా ? ఐతే ఏం ? తీయని వ్యాధి. డాక్టర్ని చూసి నాలుగైదురోజులు దాటిపోతూంది. వర్షమూ ముసురూ. రోడ్లన్నీ బురద బురద. మన యిళ్లలాగే రోడ్లుకూడా ఎండకేతప్ప వానకి పనికిరావు.

స్వింగ్‌డోర్స్ తెరవబోతూ ఒక్కసారి సందేహించాను. కన్సల్టింగ్ టైములో డాక్టర్ పర్సనల్ రూమ్‌లో ఎందుకున్నాడు.

అతనికీ నాకూ మధ్య అరమరికలులేవు. నాకు ప్రవేశంలేదనే స్థలమూ లేదక్కడ.

తలుపులు తోశాను. సిగరెట్ పొగ గుప్పుమంది. మబ్బుపట్టిన ఆకాశంలా ఉంది సిగరెట్ పొగ ఆవరించిన ఆ గది.

"శేఖరం !...చంద్రశేఖరం..'

రెండో పిలుపుకి కాని నా రాకను గమనించలేదతను. గమనించాక మాత్రం. ఉత్సాహంగా ఆహ్వానించాడా అంటే అదీలేదు !

ఏదోలోకం నుంచి మల్లె నీరసంగా, నిర్లిప్తంగా " రా కూర్చో " అన్నాడు.

అవమానం అనిపించలేదు కానీ నా మనసు బాధపడింది. క్షమించేశాను.

అతను ఆలోచనల లోకంనుంచి దిగిరాద ల్చుకోనట్లున్నాడు.

అతన్నంత వేదిస్తున్న సమస్యేమిటి ?

"చెప్పవయ్యా ఏం జరిగింది ? ఈ మౌనమూ, ఆలోచనలూ ఏమిటి? అడిగాను. చంద్రశేఖరం నావేపు ఒకసారి చూశాడు. అతని కళ్లు చూశాక నాకు భయం వేసింది.నిశ్చయంగా అతని కళ్ళలోని కాంతిక్షీణతకు కారణం సిగరెట్ పొగ ఎంతమాత్రమూ కాదు. కొమ్మలు ఎండిపోడానికి కారణం చెట్టు వేళ్ళలో ఉండేటట్లే, చంద్రశేఖరం కళ్ళల్లోని నిర్లిప్తతకూ, నిరుత్సాహానికీ హేతువు అతని మనసులో ఉండి ఉండాలి. అది ఏమిటి?